రంభ

'గిరి'

౧

"దొరసానిగారు వున్నారా!"

"ఉన్నారండి ఇప్పుడే వొచ్చారు."

"అయితే యీకార్డు తీసికెళ్లి యివ్వు"

అందమైన సంచిపెట్టెలోంచి కార్డుతీసి నౌకరుకు యిచ్చాడు చటర్జీ. నౌకరు తొందరగ వెళ్లాడు లోపలికి. చటర్జీ కార్లో కిటికీదగ్గరకి జరిగి ఆయింటిని బాగా పరికించిచూసాడు. దేశాన్నంతా తన రూపలావణ్యంచేత, నటనాకౌశల్యంచేత, గానమాధుర్యంచేత తన్మయత్వం నొందించి, తనుపాడిన పాటల్ని యువకలోకంచేత తారకమంత్రంగా జపింపజేసిన నళినీదేవి అంటే యెంతపెద్దయిల్లో ఆమెది, యెంతవైభవమో అనుకున్నాడు చటర్జీ. సులోచన, మాధురి మొదలైన వాళ్లమల్లె మహారాణిభోగం అనుభవిస్తోం దనుకున్నాడు. కాని యీచిన్నకాంపౌండు, యీచిన్న యిల్లు, ఆడాబులేని నౌకర్ని చూసి కొంతవిస్మయం కలగకమానింది కాదు. ఆగేటుకి యెడమపక్కన కొద్దిపాటివెడల్పుతో గోడకి అమర్చబడిన మెరిసే నల్లరాతి పలకమీద వెండితీగతో తెనుగులో పొదిమిన ఆమె పేరును చూట్టంతోటే ఆమెనిగురించి తనువిన్న విషయాలన్నీ జ్ఞాపకంవొచ్చాయి — ఆమెఉత్కృష్టమైన కళోపాసన, వ్యక్తిత్వజీవితం, అన్నిటికీమించిన ఆమె స్వదేశాభిమానమతం.

నౌకరు త్వరగా వొచ్చాడు. "లోపలికి వేంచేయండి" అని కారుతలుపు తెరిచి పక్కకు నుంచున్నాడు. చటర్జీ కారుదిగి లోపలికి నడిచాడు. లోపల గోడనానుకొని నానారంగుల్లో వికసించిన పూలమొక్కలు దుమ్ముపోరని పచ్చని చిగురుటాకుల్తో నిగనిగలాడుతోన్నాయి. తీర్పుగా బండలుపరిచిన దారికి యిరుప్రక్కల తెల్లగా చేమంతిపూలు వికసించాయి వసారమెట్లదాక. నాలుగుకుర్చీలకు యెక్కువస్థలంలేని ఆచిన్నవసారాలో తలుపుకి రెండువేపుల రెండుపేము కుర్చీలు వున్నాయి. ముందుకి స్ఫటికపురాతిబల్లమీద బంగారంలా మెరిసే తొట్టిలో నిగనిగలాడే చెట్టు వుంది. అప్పుడు పాలిషుచేసినట్టు మెరిసే తలుపులోపలికి దారిచూపించి, "కూర్చోండి, అమ్మగారు స్నానం చేస్తోన్నారు, యిప్పుడే వొస్తారు" అని సన్నగా వేలాడే పరదాను పక్కకుతొలిగించి పట్టుకున్నాడు నౌకరు. చటర్జీని మొదట ఆకర్షించింది ఆగదిలోని అసాధారణ పరిశుభ్రత. ఆతెల్లనిగోడలు చాలామటుకు వుత్తవిగానే వున్నాయి. ఎడమవేపుతోటలోకి చూసే పెద్దకిటికీ వొహటుంది. పసుపురంగుపరదా ముడతలు ముడతలుగా వేళ్లాడుతోంది దానికి. పెద్ద యిత్తడి పంజరంలో జామపండుని తింటోన్న చిలుకొహటి — మెడచుట్టు యెర్రనిపట్టె వున్నది — వేళ్లాడుతోంది ఆకిటికీమధ్య. ఎదురుగోడకి మధ్యప్రదేశంలో తెల్లఫ్రేముకట్టిన దామెర్లరామారావు 'నటరాజు' పెద్ద త్రివర్ణచిత్రం వుంది. కుడివేపుగోడకి భగీరథుడు వ్రాసిన 'అస్తమయం' వుంది. గోడలపొడువున గజంనరపాటి వెడల్పుతో యెత్తైన తెల్లని పరుపుంది కూచోటానికి. వెనక్కి, పక్కలకీ వొరగటానికి మహమల్ గవచన్లమెత్తలు. మధ్యప్రదేశంలో మంచితివాచీ. దానిమీద నక్షీచేసిన పటోక్కాణపు కర్రపీటమీద మూడడుగుల యెత్తుతో అనాచ్ఛాదితదేహంతో నృత్యంచేస్తోన్న రాధికవిగ్రహం పాలరాతిది వుంది.

తలవని దృశ్యం తటస్థపడ్డందున వొక్క నిమిషం నిర్విణ్ణుడై అట్లాగే గనములో నుంచున్నాడు చటర్జీ. తరువాత హ్యాటుని తలుపుపక్కన నిర్దేశింపబడిన స్టూలుమీద పెట్టి, బూట్లు విప్పి ఆశిలావిగ్రహం దగ్గిరకెళ్లి అక్కడే తివాచీమీద కూచొని ఆవిగ్రహాన్ని అన్నివేపుల్నుంచీ విమర్శదృష్టితో పరీక్షించాంనాచూసి డ్కుడుచా. ననిౖడెచతుతప.

లోపలివేపు తలుపులోంచి నళిని ప్రవేశించింది. అప్పుడే స్నానంచేసి శుభ్రమైన నుదుటికి కెంపులాంటి కుంకమ పెట్టుకుంది. కేసరవర్ణపు సన్నని చీర కట్టుకుంది. జుట్టుని వొదులుగా మెడమీదికి జారవిడిచింది. చటర్జీని చూసి నమస్కరిస్తో, "క్షమించండి, స్నానం చేస్తోన్నాను మీరొచ్చే వరకు" అంది.



 "చటర్జీని చూసి నమస్కరిస్తో, "క్షమించండి, స్నానం

చేస్తోన్నాను మీరొచ్చేవరకు" అంది."

చటర్జీ లేచినుంచొని నమస్కారం చేసాడు. చెప్పులను గనములో వొదిలి ఆతెల్లనిపరుపులో పాదం దిగపడేట్టు వొక్కొక్క అడుగు వేస్తో ఆపాతికేళ్ల పడుచు నడుస్తోంటే వొయ్యారం వొలికింది. కవిత్వంకన్న యెక్కువ మాధుర్యం పుట్టించింది. చటర్జీకియెదురుగా కూచొని వొహ మెత్తని దిండుని దగ్గిరకి లాక్కుంది.

"ఈవిగ్రహాన్ని చూస్తోన్నట్టున్నారు మీరు అప్పణ్ణుంచి. అయినా వీటికన్న వేయిమ్మళ్లు అందమైనవాటిని సృష్టించే మీకు యిదెందుకు నచ్చుతుంది!''

"నేను చేసేవన్నీ ప్లాస్టరుతోనే. అయినా ప్లాస్టరుతోకూడా యింతజీవకళ కలిగెంచట మంటే యెంతో నైపుణ్యం కావాలి. నా పదిహేనోయేడునుంచి యీయిరవైయేళ్లు యీకళ కోసం కృషిచేసినా యీశిల్పిదగ్గిర యెంతో వుంది నేర్చుకోవాల్సింది. ఎవరా శిల్పి మహాశయుడు ?''

"అతనిపే రెవరికి తెలుసు ! రెండేళ్ల క్రింద శ్రీశైలం వెళ్లినప్పుడు వొహచెట్టు నీడలో మురికి గుడ్డ వొహదాన్ని పరిచి దానిమీద యిట్లాంటి విగ్రహాలు పెట్టుకొని అమ్ముకొంటున్న చెంచుకి రెండుసేర్ల బియ్యం పెట్టి కొన్నా దీన్ని."

"నిజమే ? మాకలకత్తాలో దీనికి రెండు వేలకు చావులేదు. హిందోళనం నృత్యంచేయటమే గగనం. అందులో అట్లాంటిపోజుని దృక్పథంలో నిల్పి యీరాతిలోకి దింపి యిట్లా జీవం పోయటం అంటే ఆశిల్పి వంద్యుడు."

"అయితే మీరు చేసే విగ్రహాలు సాధారణంగా యెక్కువ యెక్కడ అమ్ముడుపోతాయి ?"

"చాలావరకు మాబెంగాలులోనే. గత సంవత్సరం బొంబాయిలో జరిగిన ప్రదర్శనంలో పదహారు విగ్రహాలు అమ్ముడుపోయాయి. సిమ్లాలో వైస్రాయియింట్లో రెండువిగ్రహాలు చేయటానికి ఆర్డరిచ్చారు. ఈయేడు బొంబాయిలో జరుగబోయే ప్రదర్శనంలో మొకటిబహుమతి

పొందేట్టు విగ్రహం తయారుచేయాలని రాత్రింబవళ్లు ఆలోచిస్తోన్నాను. అందుకనే మీ సహాయం అపేక్షించి కలకత్తానుంచి వొచ్చాను."

"సెలవీయండి, నాచే తేం కాగల్దో."

"మీరు నటించిన 'మోహినీ' అనే ఫిలిం బెంగాలునంతా ముగ్ధులనుచేసింది. దర్బారీకానడాను మీరు నృత్యంచేస్తో పోజులని యిచ్చారు చూడండి, దాంట్లోని యీపోజు విగ్రహంతయారుచేసి ప్రదర్శనానికి పంపాలనుకున్నాను."

జేబులోంచి వొక ఫిలింముక్కను తీసి ఆమె కందించాడు. ఆమె దాన్ని వెల్తురుకు పట్టిచూస్తోంది.

"కాని కేవలం ఫోటోను చూసి విగ్రహంచేయటం అంత చులకనికార్యం కాదు. కాబట్టి మీరు కొన్నిసార్లు ప్రతిమలా (Model) నుంచోటానికి వొప్పుకుంటే నాయదృష్టం. ఆఆశతోనే మాకలకత్తానుంచల్లా వొచ్చింది."

జేబులోంచి బంగారుసిగరెట్టుపెట్టె తీసి "తీసుకోండి" అంటో ఆమె కందించబోయాడు. కాని ఆమె చేతులుజోడించి, "అలవాటులేదు" అంది వినయంగా.

"క్షమించండి" అంటూ సిగరెట్టుతీసి వెలిగించాడు. సిగరెట్టు వెలిగించేఅప్పుడు నళిని ఆతన్ని నిదానించి చూసింది. వోపికతో దువ్విన ఆతల, గుత్తమైన కాలరు, టై, మడతచెదరని సిల్కుకోటు, జగజగ మెరిసే మంచిరాతి వుంగరం, ఎక్కువకిమ్మతుచేసే చేతి గడియారం యివన్నీ వొక్కచూపులో చూసింది. కళ్లని ద్వారంవేపు త్రిప్పుకుంది. అక్కడ ఆతని పేటెంటుతోలుబూట్లు అవుపడ్డాయి. ఇవన్నీ ఆమె గమనించిందని చటర్జీకూడా కనిపెట్టాడు.

"మిమ్మల్ని చూడటంతోటే శిల్పి అనుకోటం కష్టం."

"అవును, సాధారణంగా యీకళోపాసకుల్ని పీడించే దారిద్ర్యం నా కంతగా లేదు కాబట్టి."

"కాని శ్రీమంతులు కళని ఉపాసించడం అంటే కూడా ఆశ్చర్యం కలుగుతుంది."

నవ్వాడు చటర్జీ. "సరేకానీండీ, ఎప్పణ్ణుంచి నుంచుంటారు మీరు నాకోసం? రెండురోజుల కొకగంట నుంచుంటే చాలు. గంటకి మూడువందలు తక్కువ ప్రతిఫలం కాదనుకుంటాను."

"క్షమించండి. నాకు వీలుపడదు."

"ఎందుకని? అయితే అయిదువందలు తీసుకోండి."

"నాకు డబ్బుతో అంతఅవసరం లేదు. డబ్బే నాకు ప్రధానమైతే యేబొంబాయిలాంటి పట్టణానికో వెళ్లి యెక్కువడబ్బూ, యెక్కువపేరూ గడించేదాన్ని."

"మరి అభ్యంతర మెందుకు నాకు సహాయపడడానికి?"

"క్షమించి కారణా లడగకండి."

లేచి నుంచుంది. చటర్జీకూడా లేచాడు విధిలేక.

"తొందర లేంలేదు. ఇంకా సెలవరకూ యీవూళ్లో వుంటా. ఈకార్డు వుంచండి. మీరు అభిప్రాయం మార్చుకోటంతోటే నాకు తెలిపితే ధన్యుడిని. నమస్కారాలు."

కారు వెళ్లిపోయింది. నళిని కార్డుచూసింది. "స్పెన్సరుహోటలులోనా వీరుండటం!" అంది. దాన్ని రెండుగా చించి కిటికీలోంచి బైటపడేసింది.

౨

ఆకొత్తఫిలింలో ఆనాడు వుదయంనుంచి నటించడంవల్ల చాలా అలసిపోయింది నళిని. నాలుగింటికే స్టుడియోలోంచి బైటికి వొచ్చి సిద్ధంగావున్న కార్లో కూచుంది. అందాకా గేటుపక్కన నీడలో నుంచొని వున్న యిరవై యేళ్ల యువకు డొకడు మెల్లగాచేతులు నలుపుకుంటో కారువేపువొచ్చాడు. ఏదో అనాలని ప్రయత్నించాడు. కాని మాట పెకల్లేదు. పెదిమలు

చప్పరిస్తో చేతుల్ని మరీగట్టిగా పిండుకుంటో నుంచున్నాడు. ఆజుట్టంతా చెదిరిపోయినా, గుడ్డలు అశ్రద్ధగా వున్నా, ముఖం రక్తవిహీనంగా వున్నా అతడు సామాన్యబిచ్చగాడు కాదని స్పష్టంగా తెలుస్తుంది. ఆముఖంలో యేదో గొప్ప, యేదో కాంతి, కళ తాండవమాడుతోన్నాయి. నళిని వొక్క నిమిషం నిదానించి అతని వేపు చూచి అతకు యేమీ మాట్లాడకపోవటంచేత, "ఎవరు నువ్వు ? ఏంకావాలి?" అని అడిగింది.

ప్రయత్నంతో తల పైకెత్తి నీళ్లు తిరిగే ఆకళ్లతో దీనంగా చూస్తో అన్నాడు, "వోహనెలరోజులు నాకు ప్రతిమలా వుండాలి మీరు. నేను శిల్పిని." పెదిమలు చప్పరిస్తో మరీదీనంగా అన్నాడు. "డబ్బు లేదు మీ కివ్వటానికి. కనకగిరిరాజాగారు "రంభ" విగ్రహంకోసం పెట్టిన యిరవై వేల బహుమతి నాకు దొరికితే మీరడిగినంత యిస్తా. కావాలంటే ఆమొత్తమంతా మీకే."

"శిల్పివా నువ్వు ?"

"అవును ; ప్లాస్టర్తో విగ్రహాలుచేస్తా"

ఆమె అట్లాగే అతనిముఖంలోకి చూస్తో వూరుకుంది.

"అయితే వొప్పరా ?" కిందిపెదిమ మరీ వొణికింది. గుడ్లల్లో నీళ్లు గిఱ్ఱున తిరిగాయి.

నళిని తలుపుతెరిచి, "లోపలికి రా" అని ఆవేపు జరిగి ఆతనికి కూచోటానికి స్థలంచేసింది.

"వొప్పుకుంటారా ?" అన్నాడాతడు నోరు తెరిచి అమితానందంతో.

"ఆలోచించాలి. ముందైతే నీస్టుడియో చూద్దాం. డ్రైవర్తో చెప్పు అదెక్కడో."

అతడు కార్లోకి యెక్కాడు. డ్రైవరుకి అవసరమైన మాటలు చెప్పాడు. కారు కదిలింది. ఆతను వెనక్కి జరిగి నళినివేపు చూసాడు. ఆమెసిల్కుచీర, పొట్టిచేతుల జేకెట్టు, యింకా పేంటు పూర్తిగాపోని చెంపలు చూసి తనకాలర్ని సరిచేసుకున్నాడు. కోటు లోపలికి యీడ్చుకోపోయిన షర్టుచేతుల్ని ముందుకి లాక్కున్నాడు. మళ్లీ ఆమెవేపు చూసాడు. ఈతని చర్యల్ని గమనిస్తోన్న నళిని ముసిముసిగా నవ్వుతోంది.

"నీపేరేమిటి ?"

"కిశోరుడు."

"బెంగాలి అనుకరణం ?"

"మానాన్న ముద్దుగా పెట్టాడట యీపేరు."



"ఎవరు నువ్వు? ఏం కావాలి?" అని అడిగింది.

కారు మూలమూలలు తిరిగి చిన్నచిన్న సందుల్లోంచి వెళ్లుతోంది. వోహ చిన్న రెండంతస్తుల పాత పెంకుటింటిముందు ఆగింది. చీకటిగదిలోంచి పొగ మూరిన గోడల్ని పునుక్కుంటో పాత మెట్లని యెక్కి రెండో అంతస్తుపైకి వెళ్లారు. అక్కడ వోహగదితాళం తీసి కిశోరు ముందు లోపలికెళ్లి కిటికీలు తెరిచి నళినిని రమ్మన్నాడు. మంచంలో పక్కమీద పడివున్న పుస్తకాలు, పెన్సిళ్లు తీసి గుడ్డతో దుమ్ముదులిపి నళినికి కూచోటానికి స్థలంచేసాడు. నళిని అక్కడ కూచొని వొక్కసారి గదినంతా పరికించి చూసింది. గదంతా చెత్తకుప్పలాగుంది. పెన్సిల్‌తో బొమ్మలుదించిన కన్వాసుచుట్టలు మూలమూలలకి పడివున్నాయి. రుద్రదేవునివి, కృష్ణదేవరాయలువి, తిక్కనవి, వరూధినివి మొదలైన విగ్రహాలు పూర్తిఅయినవి కొన్ని, కానివి కొన్ని గదంతా వున్నాయి.

"ఈగదిలోనేనా నువ్వు వుండటం ?"

"అవును. క్షమించండి. రేపు మీరు వొచ్చేవరకు శుభ్రపరిచి వుంచుతాను." బొమ్మలు చిత్రించే బోర్డుకి పిన్నుల్తో కాగితం చెక్కతో పనిలో మున్నడైపోయాడు కిశోరు. నళిని లేచి మెల్లిగా ఆబొమ్మల్ని చూస్తో పచారుమొదలు పెట్టింది. కిటికీదగ్గిర గుడ్డకప్పబడివున్న విగ్రహందగ్గిర కెళ్లి ఆగుడ్డ తీసింది. అది "అహల్య" నడుంపైన చెయ్యి ఆనించుకొనివున్నచోట సాలెపురుగు గూడుకట్టింది. తనకు తెలీకుండానే నళిని ఆగుడ్డతో ఆవిగ్రహాన్ని శుభ్రంగా తుడిచింది. దానిపక్కనే వీరవనిత "రుద్రమదేవి" వుంది. దాన్నికూడా తుడిచింది. అట్లాగే వరసగా ఆవేపువున్న విగ్రహాలన్నిటినీ తుడిచి శుభ్రపరిచి చక్కగా అమర్చింది. పక్కనవున్న పెట్టెమీద పడేసిన పుస్తకాలనికూడా గుమ్మదులిపి వొకచో పెట్టింది.

"ఇహ వొచ్చి నుంచుంటారా ?"

కిశోరు పెన్సిల్, రబ్బరు చేతులో పట్టుకొని బోర్డుదగ్గిర సిద్ధంగా నుంచున్నాడు. ఆతనిమాటలు విని వులికిపడ్డది నళిని. అప్పుడే మెలుకవవొచ్చినట్టయింది. చేతులోని మురికిగుడ్డని చూసి సిగ్గుతో కిందపడేసి వెళ్లి మంచంలో కూచుంది.

"ఈవాళ చాలా అలిసాను. రేపణ్ణుంచి నుంచుంటా"

"సరే అట్లాగే కానీయండి. మరి గట్టిగా వొస్తారుకదూ రేపు ?"

"రాజాగారు "రంభ" కోసం పెట్టిన బహుమతి నీకే వొస్తుందని యేంనమ్మకం, భారతదేశంలోని శిల్పులంతా దానికోసం ప్రయత్నిస్తోంటే ?"

"వొస్తుంది. తప్పకుండా నాకే వొస్తుంది. వొక్కనెలరోజులు మీరు నాకోసం శ్రమపడితే చాలు. వోడానా అదే నాఆఖరిపరాజయం. దాంతో నాఆశలు, వూహాసౌధాలు అన్నీ చెల్లు."

ఉద్రేకమైన ఆముఖాన్ని నిదానించిచూసింది.

"వుండండి టీ కాచిపెడ్తా, వొక్కనిమిషంలో."

పెద్దపెట్టెవెనకాల పడివున్న స్టవును తీసి వెలిగించ ప్రయత్నిస్తోన్నాడు. అట్లాశ్రద్ధతో నిమగ్నుడైన ఆకిశోరుని చూస్తో నళిని ముసిముసిగ నవ్వుతోంది. స్టవు వెలుగదు. చెవుదగ్గిర వూపి చూసాడు. నూనె లేదు దాంట్లో. నళిని ఫక్కున నవ్వింది. కిశోరు సిగ్గుతో ఆమెవేపు చూసాడు.

"మీలాంటి కళోపాసకులు వాయుభక్షణమీద బతగ్గలరు, కోకిల మామిడిచిగుళ్లమీద బతికినట్టు. పద యేమైనా తిందాం."

కిశోరు ఆమెవెంటనే వెళ్లాడు. ఆతడు మరిచిపోతే గదికి తాళం ఆమే వేసింది.

3

మర్నాడు సరిగ్గా రెండింటికి వొచ్చింది. పొద్దుణ్ణుంచి గదంతా శుభ్రపరిచాడు కిశోరు. కొత్తబ్లేడుతో క్షవురం చేసుకున్నాడు. స్నానంచేసి దుస్తులు మార్చాడు. దగ్గిర మిగిలిపోయిన నాలుగురూపాయిలు పెట్టి మంచిపరికరాలు, కాగితాలూ అవీ కొన్నాడు.

నళిని రావటంతోనే బోర్డుదగ్గిరకి పరుగెత్తి, "వెళ్లండి ఆపరదా వెనక్కి వెళ్లి గుడ్డలు విప్పేయండి."

నళిని అదిరింది అతనివేపు చూసింది. మిక్కిలి వుల్లాసంతో పరికరాలుఅమర్చుకుంటోన్నాడు.

బోర్డుకి దగ్గిరగా వోహ చౌకుపీట వేసి దానిమీద తువాలుపరిచాడు. ఆమెవేపు చూసాడు.

"వెళ్లండి. ఆలస్య మెందుకు?"

అతనికళ్లల్లోకి చూసిం



"ఆమెకి చప్పున గుడ్డని దేహంమీదకి లాక్కుంది."

నళిని. అమాయకత్వం తప్ప వేరేమీ అవుపళ్లేదు. అతడు వేరే ప్రపంచంలో వున్నట్లు సూచిస్తోన్నాయి అవి. మెల్లిగా ఆ తెరవేపు వెళ్లింది. వొహకుర్చీ వుంది లోపల. దానిమీద కూచొని వొక్కటొక్కటిగా వొస్తువులన్నీ విప్పి పక్కస్టూలుమీద పెట్టింది. చెప్పులని కూడా వొదిలింది. అక్కడపడివున్న నల్లని గుడ్డని ఆ తెల్లని దేహంమీద కప్పుకుంది. మెడదగ్గిర, నడుం దగ్గిర ఆ గుడ్డని గట్టిగా ముదిరిపట్టుకుంది. మెల్లిగా బోర్డుదగ్గిరకి వెళ్లినుంచుంది.

“ఆస్టూలుమీద నుంచోండి... ఆఁ. నావేపు తిరగండి. ముఖం కాస్త కిటికీవేపు తిప్పాలి. ఆఁ... అట్లాగే. ఇహ ఆగుడ్డని వొదిలేయండి.”

నళిని ఆగుడ్డని మరీదగ్గిరగా లాక్కొని అతని ముఖంలోకి చూసింది. ఆమె సంకోచమే అతనికి స్ఫురించనట్టుంది.

“ఊఁ... తీసివేయండి.”

ధైర్యంతో తల పైకెగేసి కళ్లుమూసుకొని గుడ్డని కిందికి జారవిడిచింది.

“ఓ! అందం. అట్లాగే వుంచండి తలని.”

పదినిమిషాల్లో చిత్రం పూర్తిచేసి ప్లాస్టరు ముద్దని విగ్రహంచేయటం ఆరంభించాడు. నళిని కొంచెంగా కళ్లుతెరిచి చూస్తోంది. ఆమెదేహాన్ని చూస్తో ఆమట్టివిగ్రహానికి ఆకృతి కలిగిస్తోన్నాడు. అతనిచేతులు ఆవిగ్రహపు భుజాల్ని తాకినప్పుడల్లా తన భుజాల్ని అతను తాకినట్లే అనిపించింది నళినికి. ఆమె దేహాన్ని చూస్తో ఆబొమ్మకి అంగసౌష్ఠవం, ముడుతలు, వొంపులు అతను కల్పిస్తోంటే వొళ్లు పులకరించిందామెకి. తనదేహాన్ని అట్లా చూస్తో యేమాత్రం వుద్రేకంలేక శాంతంతో శిల్పిస్తోన్న ఆకిశోరు మనిషేనా అనిపించిందామెకి. చేతులకి గుండ్రతనం చేస్తో తొడల్ని స్పృశించాడు. వాటికి ఔన్నత్యం తేవాలని రెండుచేతుల్తో ప్రయత్నిస్తోన్నాడు నళినితొడలవేపు చూస్తో. ఆమె చప్పున గుడ్డని దేహంమీదికి లాక్కుంది. చీలమండలు సైతం అవుపడకుండా కప్పుకుంది. బిగువుగా పట్టుకుంది.

కిశోరు ఆశ్చర్యపడ్డాడు.

“ఏం, అప్పుడే?”

“అబ్బ, చేతకాదు. అలసిపోయాను.”

చప్పున తెరచాటుకి పరుగెత్తింది. వొక్క నిమిషం అట్లాగే వుండిపోయినం కుర్చీలో. వెళ్లిపోతోన్నప్పుడు ద్వారందగ్గిర కిశోరు

“రేపు యిదేసమయానికి వొస్తారు కదూ?”

“ఆ.”

మర్నాటినుంచి అతను అయింది అన్నదాక కళ్లని గట్టిగా మూసుకొని నుంచునేది.

ఇరవైరోజులు గడిచాయి. స్థూలదృష్టితో చూసేవాళ్లకి ఆ అందమైన విగ్రహం సమగ్రమైనట్లే అవుపడుతుంది. కాని యింకా దాంట్లోకి ప్రాణం రాలేదు. ప్రాణంపోయటంలోనే వుంది కళంతా అంటాడు కిశోరు. ఈయిరవైరోజుల్లో వొహరి చరిత్ర వొహరికి వొకింత తెలిసింది. కిశోరుతండ్రి శ్రీమంతుడు. కాని కిశోరు చిన్నప్పటినుంచి యీకళల్లో అభిరుచికలవాడవటంచేత చదువుల్లో శ్రద్ధవహించనందున తండ్రీకొడుకులకు సరిపడకుండా అయింది. మరీభరించటానికి వీలులేకుండ అయినాక కిశోరు యింట్లోనుంచి వెళ్లిపోయినాడు. అప్పణ్ణుంచి వొహపూట తింటో వొహపూట మాడుతో శిల్పకళకు తనజీవితాన్ని ధారవోస్తోన్నాడు. నళినికి చిన్నతనంలోనే భర్తపోయాడు. అత్తవారి ఆస్తి యేమాత్రం అబ్బలేదు. ఆధారంగావున్న తల్లి కూడా పోయింది. అప్పణ్ణుంచి ఫిలింకంపెనీలో చేరింది. తన సర్వశక్తుల్నీ ఆకళకి ధారవోసి ఆంధ్రదేశానికి వొహ అలంకారం యివ్వాలని నిశ్చయించుకుంది. అందుకనే తక్కువవేతనానికైనా ఆంధ్రదేశంలోనే వుంది.

ఆనాడు మధ్యాహ్నం సరిగ్గా రెండుగంటలకి కిశోరుయింటికి వెళ్లింది నళిని. ద్వారందగ్గిరే అల్లరిగా

వుంది కాస్త. నుంచున్నవాళ్లని త్రోసుకొని లోపలి కెళ్లింది. క్షీణించి రక్తవిహీనమైన ముఖంతో కిశోరు వొహామూల కూచున్నాడు. నళినిని చూసి సిగ్గుతో తల వంచుకున్నాడు. చేతులలో కాగితాలకట్ట పట్టుకున్న లావాటి ప్రభుత్వోద్యోగి వొహాడు సిగారుపీలుస్తో కాలుమీద కాలు వేసుకొని పాతయీజీచేర్లో కూచున్నాడు. ఇదంతేమీ బోధపడింది కాదు నళినికి. మెల్లిగా కిశోరుదగ్గిరి కెళ్లి ఆతనిభుజాన్ని తట్టుతో, "ఏమిటివిషయం కిశోరు?" అని అడిగింది. కిశోరు రెండుచేతుల్లో ముఖం దాచుకున్నాడు. ఆ పెద్దమనిషి చెప్పాడు "ఈతను యీమార్వాడీవద్ద రెండువందలు తీసుకున్నాడు. అది వడ్డీతో అయిదువందలయింది. కోర్టువాళ్లు బాడీ వారెంటు యిచ్చారు." డిక్రీ కాయితం అందించాడు. అది చదువుకొని మళ్లీ కిశోరువేపు చూచింది నళిని. అట్లాగే నుంచున్నాడు.

"నేనిస్తాను, నావెంట రండి."

మార్వాడీ, జేలిఫ్ సంతోషంగా లేచారు. కిశోరు ముఖం పైకెత్తి నిర్ఘాంతపోయి చూస్తోన్నాడు. ఉన్నారనికూడా యెరుగడు.

నళినిదగ్గిర అయిదువందలు కాదుగాని అయిదు రూపాయీలుకూడా ఆముహూర్తాన లేవు. ఏంచేస్తుంది! ఎవరిదగ్గిరి కెడ్తే యెవరిస్తారు? విక్రయిద్దామన్నా అంత విలువైనవొస్తువు యేదీలేదు. అనేకవిధాలుగా ఆలోచించింది. ఏదో నిశ్చయించుకుంది.

వాళ్లందర్నీ తనయింట్లో దింపి యిప్పుడే వొస్తావుండమని స్పెన్సరుహోటలుకి వెళ్లింది. చబ్జీ దగ్గిరకి తనకార్డు పంపింది. తక్షణమే జహానుపట్టుగౌను తొడుక్కొని సిగరెట్టు కాలుస్తో చబ్జీ బైటికి వొచ్చాడు. అతివినయంగా స్వాగతంచేసి గదిలోకి తీసి కెళ్లి మెత్తని దిండ్ల సోఫాలో కూచోపెట్టాడు.

"నాకు తెలుసు తప్పకుండా మీరు మీఅభిప్రాయం మార్చుకొని నాకు సహాయపడతారని."

"కాని వొక్కషరుతుపైన నేను మీవిగ్రహానికి ప్రతిమగా వుండటానికి వొప్పుకుంటాను."

"ఏమిటది?"

"మాకనకగిరిరాజాగారు "రంభ" కోసం పెట్టిన బహుమతికి మీరు పోటీచేయొద్దు."

"సంతోషంగా వొప్పుకుంటాను." చప్పున లేచి డ్రాయరు తెరచి పది వందరూపాయిల నోట్లు యెంచి నళిని కిచ్చాడు.

"నాకు యెక్కువ అవసరం లేదు. ఈపదిరోజులు రోజొక అర్ధగంట నుంచుంటే చాలు"

"సాయంత్రం అయిదింటికి వొస్తాను."

"చిత్తం."

నళినికి తెలుసు కిశోరు నిన్నటినుంచి ఉపవాసమే వుండివుంటాడని. అందుకనే జేలిఫ్ వాళ్లని పంపేసి త్వరగా రుచ్యమైన వంటని అతిశ్రద్ధతో స్వయంగా వండి కేరియర్లో పెట్టుకొని కిశోరుయింటికి వొచ్చింది. గదితలుపు తెరిచివుంది. లోపలి కెళ్లింది. ఎప్పుడూ కిశోరు కూచునే కుర్చీవేపు చూసింది. అక్కడలేడు. కిటికీదగ్గిర పెట్టెపక్కన పడివున్నాడు. ఆపెట్టెమూల మీద పడటంచేత నొసటినుంచి నెత్తురు కారుతోంది. కిటికీలోవున్న కూజాను తీసుకొని చప్పున ఆతనిపక్కకి పరుగెత్తింది. పక్కన కూచొని తలయెత్తి రక్తం అంటుతుందని లెక్కపెట్టక వక్షానికి అదుముకుంది. వొళ్లో వుంచుకొని పైటని గ్లాసులో అద్ది నుదుటిరక్తం తుడిచింది. ముఖాన్నంతా చల్లనినీటితో అద్దింది. వొక్క నిమిషంతరువాత మెల్లిగా కళ్లుతెరిచాడు కిశోరు. కళ్లు పైకెత్తి నళినిముఖంవేపు చూశాడు. ఆమె ఆతనిచేతిని గట్టిగా అదుముతో, "మంచినీళ్లు యివ్వనా కిశోరు త్రాగటానికి? "గ్లాసుతో నీళ్లు త్రాగించి మెల్లిగా లేపి కుర్చీలో కూచోపెట్టింది వొక్కనిమిషం నేలవేపు చూసి చప్పున చేతుల్లో తలపెట్టుకొని యేడ్వటం మొదలెట్టాడు. నళిని కుర్చీచేతిమీద కూచొని ఆతని భుజం మీద చెయ్యివేసింది. "ఎందుకు యేడ్వటం కిశోరు? ఈమాత్రం వొహరికొహరు సహాయం చేసుకోకపోతే యెట్లా?"

"అది కాదు. అదికాదు. ఎందుకోసం యీ మొండిప్రాణాన్ని యిన్నాళ్లు నిలిపానో, యెందుకోసం యీపాట్లన్నీ పడుతోన్నానో అదంతా అయిపోయింది. అయిపోయింది."

"ఏమిటికిశోరు? నాకేమీ అర్థమవడంలేదు."

లేచి చక్కగా కూచొని, వొక్కవిషయం మీతో చెప్పకుండా దాచాను. క్షమించాలి. సరసం మా మేనమామకూతురు. దాన్నివొదలి ప్రపంచమంతా అంధకారం నాకు. అంతా చీకటి. ఈవిషయం అందరికీ తెలుసు. కాని నేను వాళ్ల అభిప్రాయంప్రకారం బుద్ధికలిగివుండక యీకళను ఉపాసించినందుకు ఆమెవాళ్లకి నేనంటే గిట్టదు. ఈకళలో నే ద్రవ్యవంతుడనై, పేరుప్రతిష్ఠల్తో ప్రపంచాన్నంతా గింగురుమనిపించి వాళ్లచేతనే నాసరసాన్ని యిప్పించుకోవాలని యిట్లా తిండితిప్పలు మాని పాటుపడ్తోన్నా. అదంతా కథ అయిపోయింది. నాస్నేహితుడు వుత్తరం వ్రాసాడు. ఆమెను, నాసరసాన్ని వొహబేరిస్టరుకిచ్చి పెళ్లిచేసారు. ఇహ నాకేంవుంది యీప్రపంచంలో? ఎందుకు బతకాలి?"

"కిశోరు, యేడవకు కిశోరు! నీదేశంకోసమైనా ధైర్యంతెచ్చుకో. నీమీద దేశం యెంతో ఆశపెట్టుకుంది. మనదేశాన్ని తక్కినవాటిముందు తలెత్తుకొని గర్వపడేట్టు చేయటం నీచేతుల్లో వుంది. అట్లాంటి బాధ్యతని మీదవుంచుకొని సామాన్యమైన వొహస్త్రీ చేతినుంచి జారిపోతే యిట్లా చేయకూడదు."

"దేశం, దేశం! దాంతో నాకేంపని? నేనీకళ నభ్యసించింది దేశాన్ని పైకెత్తాలని కాదు. నాప్రేమకోసం, నాప్రేయసిని జయించటంకోసం."

నళిని వూగిపోయింది. ఈతనిలో, యీబొమ్మలు చేసే కుమ్మరిఅబ్బాయిలో యింతప్రేమ యిమిడివుంటుం దనుకోలేదు. చప్పున ఆతనితలని దగ్గిరగా లాక్కొని దానిపైన తనచెంప నానించి కళ్లు మూసుకుంది.

"కిశోరు, ఆడదానికి కూడా హృదయం వుంటుంది. ఆడదికూడా ప్రేమించగల్దు."

కళ్లు తెరిచి ఆతనివేపు చూస్తో, "నాహృదయాన్ని పగలకొట్టవుకదూ కిశోరు?"

ముహూర్తకాలం జవాబుకోసం నిరీక్షించింది. ఆతలని అట్లాగే వెనక్కియెత్తింది. మెడచుట్టూ చేతులు వేసి ఆపెదిమలకేసి చూసింది. కిశోరు ఆమెని తనమీదికి లాక్కున్నాడు.

౪

ఆయెనిమిదిరోజులు యెనిమిదినిమిషాలులా గడిచిపోయినాయి ఆజతకి. ఏమీ అభిరుచిలేని యీప్రపంచం వొక్కసారి మారిపోయింది నళినికి. ఆమెకే తెలీని వొహ నూతనానందం, నూతనశక్తి పొంగిపోతోంది. పొద్దస్తమానం కూనరాగాలుతీస్తో పరుగులిడ్తోంది. ప్రతివొస్తువులో యేదోఅందాన్ని చూసి ముద్దుపెట్టుకుంటుంది మాటిమాటికి. ఎవకి గట్టిగా అదుముకొని రెప్పలువాల్చుకుంటుంది. అద్భుతమైన ఆమె నటనని చూసి సినిమా డైరెక్టరు ఆశ్చర్యపడ్డాడు. వొచ్చేనెల నుంచి వేతనం హెచ్చిస్తా నన్నాడు. కిశోరుకూడా యేదో కొత్త సంతోషంతో కళకళలాడుతోన్నాడు. అతని "రంభ" అప్పుడే స్వర్గంనుంచి అవతరించినట్టునుంచుంది. ప్రతిఅంగం నవనవలాడుతో వుద్రేకాన్ని కలిగిస్తోంది. అయినా యింకా కిశోరు దాన్ని దిద్దితీరుస్తోనే వున్నాడు.

ఇహ మూడురోజులుంది రాజాగారి దివాణంలో పోటీవిగ్రహాలని దాఖల్‌చేయటానికి. ఇహ "రంభ"ని ముట్టుకోనని నళినితెచ్చియిచ్చిన పట్టుగుడ్డని దాని మీద కప్పాడు కిశోరు.

కిశోరుకి విస్మయంకలిగించా లనుకుంది నళిని. ఆవాళ పున్నమ. పండువెన్నల రాత్రంతా. కిశోరుకి యేమాత్రం తెలీనీకుండా ఆతన్ని పట్టుకెళ్లి అక్కడికి యెనిమిదికోసుల దూరంలో సముద్రపువొడ్డున వున్న కొబ్బరితోటలో యిన్నాళ్లునుంచి యెదిరిచూసిన ఆరాత్రిని స్వర్గంలా అనుభవించా లనుకుంది. ఆమర్నాడు కూడా అక్కడే గంధర్వుల్లాగ వుండిపోవాలని నిశ్చయించుకుంది. అందుకని అవసరమైన వొస్తువులన్నీ

సమకూర్చుకుంది. ఎన్నో కొత్తవొస్తువులని కొన్నది. అవన్నీ కార్లో పెట్టుకొని సరిగ్గా సాయంత్రం ఆరింటికి కిశోరుయింటికి వొచ్చింది. ఆమసకచీకట్లో మెట్లెక్కి పైకివెళ్లింది. ఆగదితలుపు దగ్గిరవేసివుంది. కిశోరు మాటలు వినపడ్తోన్నాయి. అట్లాగే తలుపుదగ్గిర ఆగింది. ఆడమనిషిగద్గదస్వరం వినపడ్డది. వొళ్లు జల్లుమంది. గుండె కొట్టుకుంది. ఆతురతతో ఆమాటల్ని పాటించివిన్నది.

"వెళ్లు, వెళ్లు సరసం. వెళ్లి ఆతన్తోనే వుండు. ద్రవ్యవంతుడు. సుఖపెడ్తాడు."

"నోరెట్లా ఆడుతోంది,కిశోరు,అట్లా అనటానికి! నీయీచేతుల్లో నన్ను గట్టిగా యిముడ్చుకొని నేను నీకు దక్కకపోతే వొక్కనిమిషంకూడా బతకనని ఆ రాత్రంతా జపిస్తివే, ఇప్పుడు వచ్చినభేదమేమిటి ?"

"అదికాదు సరసం. నేను ఛాందసుణ్ణి అనుకోకు. నీతో దాచట మెందుకు. నాజీవితంలోకి వుంకొకామె వొచ్చిం దిప్పుడు."

"అవును. తెలుసు. ఆమెవిషయం యీవాళ్లే తెలిసింది. కాని, కాని కిశోరు, వొక్కమాట చెప్పెయ్యి. మాట్లాడకుండా వెళ్లిపోతా. ఆమెకి నీహృదయం యిచ్చావా? నిజంగా హృదయపూర్వకంగా ప్రేమిస్తోన్నావా?"

నళిని వూపిరిబిగపట్టి తలుపుకి చెవి ఆనించి కిశోరుజవాబుకోసం నిరీక్షిస్తోంది, హంతకుడు న్యాయాధికారి తీర్పుకోసం నిరీక్షిస్తోన్నట్టు.

"లేదు, లేదు సరసం. నాది వొక్కటే హృదయం. అది వొక్కసారే, వొక్కరికే యిచ్చాను. అది నీకు."

నళిని నోట్లో పైటకుక్కుకొని పరుగెత్తింది. మెట్లమీదినుంచి క్రిందికి దొర్లింది. ఆదెబ్బనికూడా లెక్కచేయక లేచి పరుగెత్తింది. కార్లో పడ్డది. ఊపిరి సెరపటంతోటే పళ్లుబిగపట్టి కారుని స్పెన్సరుహోటలు వేపు నడిపింది.

ముందు కార్డు పంపకుండానే చటర్జీగదిలోకి పరుగెత్తింది నళిని. చటర్జీ టేబిల్ దగ్గిర కూచొని అందమైన ఆకుపచ్చని దీపపువెలుగులో యేదో రాసుకుంటోన్నాడు. నళినిని చూసి ఆశ్చర్యంగా లేచి నిలిచాడు. ఆమె ఆతని ఆహ్వానానికికూడా నిరీక్షించకుండానే సోఫాలో కూచున్నది. ఆతను మెరిసిపోయే ఆమెకళ్లు, ముఖం దీపపువెలుగులో చూసి బెదిరాడు కూడ.

"ఏమిటి తలవనితలంపుగా వొచ్చారు?"

"రాజాగారి 'రంభ'కు పోటీగడవుయింకా మూడురోజులుంది. మీతో దానికి పోటీచేయొద్దని వాగ్దానం తీసుకున్నాను."

"దానికి విరుద్ధంచేయటంలేదే నేను?"

"దానికి మీరు పోటీచేయాలి. ఆ 'రంభ'ని యిప్పుడే మొదలుపెట్టండి."

"నన్ను పోటీచేయొద్దన్నారుగా? దానికి పోటీ చేయాలన్న అభిలాషకూడా నాకు లేదు."

"కాదు, మీరు తప్పకుండా దానికి పోటీ చేయాలి."

"వ్యవధికూడా లేదే"

"రాత్రింబవళ్లు నేను నుంచుంటాను. ఈనాలుగు రోజులు కష్టపడండి. నా కోహినూర్ కూడా యీవకండి."

చటర్జీ ఆమెకళ్లల్లోకి నిదానించిచూసాడు. వాటిగుండా ఆమెహృదయాన్ని కనుగొనప్రయత్నించాడు. ఆతను అనుమానిస్తోన్నాడని నళిని కనిపెట్టింది.

"నేనిట్లా మారటానికి కారణం యిది. కిశోరు మీకు తెలుసనుకుంటా. విఖ్యాతాంధ్రశిల్పి. ఎట్లాగైనా ఆతని 'రంభ' వోడిపోవాలి."

"నిజంగా నాకు బహుమతి రావాలనివుందా?"

"అవును. ముమ్మాటికి."

తనవెంట రమ్మని చేత్తో సౌజ్ఞచేసాడు. ఆమె లేచివెళ్లింది. కుడివేపుగూలకి అడ్డంగా కట్టివున్న పగ

దాని తొలగించాడు. కప్పివున్న తెల్లగుడ్డని తీసాడు. పక్కకి జరిగాడు. నళిని కళ్లు పెద్దగా విప్పి ముందుకి జరిగింది. అచ్చం తనే నుంచున్నట్టు ఆ "రంభ" కిశోరు విగ్రహంకన్న యెంతో ఆకర్షణీయంగా వుంది. మాట్లాట్టానికి పెదిమలు విప్పుతోన్నట్టుంది. చటర్జీవేపు చూసింది నళిని. వెలిగించని సిగరెట్టు నోట్లో పెట్టుకొని తల వెనక్కివేసి నవ్వుతో "అప్పుడే మీతో నిజం చెప్పుతే వొప్పుకునేవారు కారు."

మళ్లీ "రంభ" వేపు చూసింది నళిని. పక్కనే వున్న సుత్తెను చప్పున అందుకొని పిచ్చిదానిలాగ ఆ రంభ"మీద పడ్డది. ముక్కలుముక్కలుగా కొట్టింది.

ఆముక్కలన్నీ చూరైనాక సుత్తెను కిందపడేసి, నడుం మీద చేతులు ఆనించి పళ్లుబిగపట్టినుంచున్న చటర్జీదగ్గిరికెళ్లి నిర్లక్ష్యంగా వెక్కిరింపునవ్వునవ్వి, "ఇహ పోలీసుని పిలవండి."

పక్క టేబిల్ మీదనుంచి ఫోను అందుకున్నాడు చటర్జీ.

ఆరునెల్లతరువాత మళ్లీ ఆచిన్నయింటిగేటు తెరిచారు. ఆనల్లరాతిపలకని శుభ్రంగా తుడిచారు. వాడిపోయినచెట్లు నిగనిగలాడినాయి. కిటికిలోని చిలకయిత్తడిపంజరంలో జామపండు తింటోంది.

లండను రాయల్ విమానప్రదర్శనమునందు పడిపోయిన విమానము